క్లుప్తంగా

రేపు మండల సమావేశం

మైదుకూరు: మైదుకూరు మండల సర్వసభ్య సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిషత్ సభాభవనంలో ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

నేడు డీసీసీ బ్యాంక్ ప్రారంభం

బ్రహ్మంగారిమఠం: బ్రహ్మంగారిమఠంలోని మల్లేపల్లె రోడ్డులో బుధవారం ఉదయం 10 గంటలకు డీసీసీ బ్యాంక్ ప్రారంభించనున్నారు. ఈ సందర్భంగా బ్యాంక్ అధికారులు మాట్లాడుతూ పుణ్యక్షేత్రమైన బి.మఠంలో డీసీసీ బ్యాంక్ ఏర్పాటు చేయాలని ఉన్నతాధికారులు నిర్ణయించారన్నారు. ఈ బ్యాంక్ ఇతర బ్యాంక్‌లకు సమానంగా అన్ని లావాదేవీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. రైతులు, వ్యాపారులు, ఇతర లోన్లు కూడా తీసుకోవచ్చు అన్నారు. డిపాజిట్లకు మంచి అవకాశం ఉంటుందన్నారు. ఈ ప్రారంభానికి జాయింట్ కలెక్టర్, జిల్లా డీసీసీ బ్యాంక్ అధికారులు, ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్, ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు విచ్చేస్తారని వివరించారు.

శనగ విత్తనాల పంపిణీ

మైదుకూరు: మండలంలోని వనిపంట కృషి విజ్ఞాన కేంద్రం తరపున మంగళవారం పులివెందుల రెవెన్యూ డివిజన్‌లోని రైతులకు శనగ విత్తనాలను పంపిణీ చేశారు. శనగలో ఎన్‌బీఈజీ-452, ఎన్‌బీఈజీ-776 రకాల విత్తనాలను అంకాలమ్మ గూడూరు, సింహాద్రిపురం, కసునూరు, అగ్రహారం తదితర గ్రామాలకు చెందిన రైతులకు కేవీకే అధిపతి, శాస్త్రవేత్త డాక్టర్ బాలకృష్ణ ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. అనంతరం శాస్త్రవేత్తలు బాలకృష్ణ, శ్రీవిద్యారాణి రైతులకు విత్తన శుద్ధి, మోతాదు, దుక్కిలో తీసుకోవాల్సిన మెలకువల గురించి వివరించారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

బద్వేలు అర్బన్: బద్వేలు మండలం రాజుపాలెం గ్రామ రెవెన్యూ సహాయకుడు మద్దెల మునెయ్య(59)అనారోగ్యంతో మంగళవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఏపీ వీఆర్‌ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగునాగేశం, రాష్ట్ర కార్యదర్శి గుర్రాల హరికృష్ణ తదితరులు వీఆర్‌ఏ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే ఆర్‌ఐ నాగేశ్వరి, వీఆర్‌ఓ విజయకుమార్‌లు నివాళులర్పించారు.

ఖోఖో పోటీల్లో ప్రతిభ

ప్రొద్దుటూరు కల్చరల్: మండల పరిధిలోని సాయిరాజేశ్వరి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. నెల్లూరు ఎన్‌బీకేఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన జేఎన్‌టీయూఏ అంతర్ కళాశాలల ఖోఖో పోటీల్లో బి.సురేష్, జి.ప్రశాంతిలు ప్రతిభ కనపరచి త్వరలో జరుగనున్న సౌత్‌జోన్ ఖోఖో పోటీలకు ఎంపికయ్యారు. వీరిని కళాశాల చైర్మన్ బసిరెడ్డి రాజేశ్వరరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వీరకుమార్‌రెడ్డి, కరస్పాండెంట్ వీరకళ్యాణ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ పాండురంగన్ రవి అభినందించారు.

'ఆర్జేడీపై చర్యలు తీసుకోవాలి'

ప్రొద్దుటూరు: ఉద్యోగుల మ్యూచువల్ బదిలీల్లో అవినీతికి పాల్పడిన రాయలసీమ జిల్లాల ఇంటర్మీడియెట్ ప్రాంతీయ సంయుక్త కళాశాల అధికారిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి, యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేసు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. శ్రీ సత్యసాయిజిల్లా, వైఎస్సార్, అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో ప్రతి కాంట్రాక్టు, ప్రభుత్వ, ఎయిడెడ్ లెక్చరర్లతో రూ.50 వేల నుంచి రూ.2 లక్షల వరకు వసూలు చేసి అక్రమ మార్గంలో బదిలీలు చేస్తున్నారని ఆరోపించారు.

పోరుమామిళ్ల: ఇంటర్మీడియెట్ ఆర్జేడీ రవినాయక్ అవినీతికి కేరాఫ్‌గా మారారని ఏఐఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు జగదీష్, కార్యదర్శి నాగరాజు ఆరోపించారు. గతంలో ఆయన జిల్లా ఆర్‌ఐఓ, డీవీఈఓగా పని చేసినపుడు అవినీతి ఆరోపణలు రుజువు కావడంతో సస్పెండ్ కావడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఆయన్ను ఉన్నతమైన ఆర్జేడీ పదవిలో కొనసాగించి అవినీతిని ప్రోత్సహిస్తోందని వారు పేర్కొన్నారు.

నేడు వలంటీర్ల నిరసన ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర నాయకుడు వెంకటసుబ్బయ్య

బద్వేలు అర్బన్: ఎన్నికల సమయంలో కూటమి నేతలు వలంటీర్లకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరుతూ ఏపీ వలంటీర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం పట్టణంలో నిరసన ర్యాలీ చేపట్టనున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర నాయకులు వెంకటసుబ్బయ్య, డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఎం.చిన్ని పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఆర్‌ఎస్ కల్యాణ మండపంలో వలంటీర్లతో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఎన్నికల సమయంలో వలంటీర్లను తొలగించబోమని, రూ.10 వేలు గౌరవ వేతనం ఇస్తామని హామీ ఇచ్చి.. ఎన్నికలు పూర్తయిన తర్వాత ఆ హామీని పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అంతే కాకుండా వలంటీర్లకు రావాల్సిన బకాయి వేతనాలను కూడా చెల్లించకపోవడంతో వారు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ఆలోచించి వలంటీర్లకు న్యాయం చేయాలని, లేనిపక్షంలో దశల వారిగా రాష్ట్ర వ్యాప్త ఆందోళనలకు సిద్ధమవుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో వలంటీర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు రఫీ, నియోజకవర్గ ఇన్‌చార్జి సాదిక్, డీవైఎఫ్ఐ పట్టణ నాయకులు షరీఫ్, వలంటీర్లు పాల్గొన్నారు.

కానపల్లెకు ఏమైంది?



ఈ రైతు పేరు గుమ్మళ్ల రాజశేఖరరెడ్డి. ఈయన సుమారు 15 గేదెలను పోషిస్తున్నాడు. ఇందుకోసం ప్రత్యేకంగా కూలీలను కూడా నియమించారు. గత శుక్రవారం, శనివారం, ఆదివారం వరుసగా ఈయన మూడు గేదెలు మరణించాయి. వీటి విలువ సుమారు రూ.3.30 లక్షలు ఉంటుంది. ఇంత వరకు మా గ్రామంలో ఇలా పశు నష్టం జరిగిన పరిస్థితి లేదని, గత నెల రోజులుగా ఇంటింటా ఈ దయనీయ పరిస్థితి ఏర్పడిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

- నెల రోజులుపైగా మృత్యువాత పడుతున్న గేదెలు
- భారీగా నష్టపోతున్న పాడి రైతులు
- జిల్లాలోనే పాడి పరిశ్రమకు పెట్టింది పేరు



గేదెలకు గొంతు వాపు వ్యాధి నివారణ టీకా వేస్తున్న వైద్య సిబ్బంది

ప్రొద్దుటూరు: ప్రొద్దుటూరు మండలం కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలోని కానపల్లె గ్రామం పాడి పరిశ్రమకు జిల్లాలోనే పెట్టింది పేరుగా ఉంది. గ్రామానికి సంబంధించి ప్రతి ఇంటిలో పదుల సంఖ్యలో గేదెలను పోషిస్తూ పాడి పరిశ్రమ నిర్వహిస్తున్నారు. గ్రామంలో సుమారు 5 వేల గేదెలు ఉండగా రోజూ 4 వేల లీటర్ల పాలను ఉత్పత్తి చేస్తున్నారు. సుమారు 30 మంది గ్రామానికి చెందిన వారు వ్యాపారులుగా ఏర్పడి పాలను సేకరించడం ప్రొద్దుటూరులో అమ్మడం జరుగుతోంది. మరికొందరు ప్రైవేటు డెయిరీలకు సరఫరా చేస్తున్నారు. ఇలాంటి గ్రామంలో పశువులు మృత్యువాత పడటాన్ని పాడి రైతులు జీర్ణించుకోలేకపోతున్నారు.

- గ్రామానికి చెందిన ఎర్రోడు అనే పాడి రైతుకు సంబంధించి ఒక గేదెతోపాటు మూడు దూడలు చనిపోయాయి. వీటి విలువ సుమారు రూ.లక్ష న్నరగా ఉంది. గుమ్మళ్ల ప్రతాప్‌రెడ్డికి చెందిన నాలుగు గేదెలు మృతి చెంది సుమారు రూ.2.50 లక్షలు నష్టపోయాడు.

ఇంటింటా అదే పరిస్థితి

గ్రామంలోని గుమ్మళ్ల శ్రీనివాసులరెడ్డి, కరెంట్ సుబ్బన్న, కుళ్ల రామాంజనేయులు, కుళ్ల గోపాల్, బొజ్జల బాలగుర్రప్ప, ఉమ్మనబోయిన వెంకటలక్ష్మీదేవి, లక్ష్మీదేవి, రాచకుంట బాలయ్య ఇలా అందరూ తమ గేదెలను కోల్పోయారు. గ్రామంలో ఇప్పటి వరకు దాదాపు 50 గేదెలు చనిపోయాయని గ్రామస్తులు వాపోయారు.

వైద్యాధికారుల పోస్టుమార్టం

గ్రామస్తులు ఫిర్యాదు చేయడంతో పశువైద్యాధికారులు సోమవారం గ్రామంలో చనిపోయిన గేదెలకు పోస్టుమార్టం నిర్వహించి పరీక్షలు చేశారు. ఈ విషయంపై స్థానిక పశువైద్య కళాశాల అధికారులతో చర్చించామని, గొంతు వాపు వ్యాధి అని అనుమానం వ్యక్తం చేసినట్లు తాళ్లమాపురం పశువైద్యాధికారి మాధవ ఓబుళరెడ్డి తెలిపారు. మంగళవారం పశువైద్య కళాశాల బృందం వచ్చి పరిశీలించింది. పశువులకు గొంతువాపు వ్యాధి నివారణ టీకాలు వేశారు.

వలంటీర్ పోస్టు లేకపోవడంతో ..



నేను గతంలో వలంటీర్‌గా పని చేశా. ప్రస్తుతం వలంటీర్ పోస్టు లేకపోవడంతో రూ.70 వేలు పెట్టి గేదెను తెచ్చుకున్నా. అకస్మాత్తుగా గేదె మరణించడంతో తీవ్రంగా నష్టపోయా. – గుమ్మళ్ల శైలజ, కానపల్లె, ప్రొద్దుటూరు మండలం

పాడి రైతులకు పరిహారం చెల్లించాలి



ప్రభుత్వం విచారణ జరిపి నష్టపోయిన పాడి రైతులకు పరిహారం చెల్లించాలి. గ్రామస్తులందరూ గేదులు చనిపోవడంతో చాలా నష్టపోయారు. – చిన్నిబోయిన రెడ్డయ్య, కానపల్లె, ప్రొద్దుటూరు మండలం

ఎంపీడీఓకు సత్కారం

పోరుమామిళ్ల: పోరుమామిళ్ల ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు తీసుకున్న రమణారెడ్డిని మంగళవారం జడ్పీటీసీ ముత్యాల ప్రసాద్, వైస్ ఎంపీపీలు సీఎం బాష, చెన్ను రాజశేఖర్ సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేయాలని, మండల అభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు ఇవ్వకపోతే ధర్నా



మండల సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ తెలిదేల లక్షుమయ్య

చాపాడు: ఎనిమిది నెలల క్రితం విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ తీగల కోసం దరఖాస్తులు చేసుకోగా ఇప్పటి వరకూ రైతులకు ఇవ్వలేదని.. మరో నెల రోజుల్లో ఇవ్వపోతే విద్యుత్ కార్యాలయం వద్ద రైతులతో కలసి ధర్నా చేస్తామని మండల అధ్యక్షులు తెలిదేల లక్షుమయ్య అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులందరూ ప్రజలు, రైతుల కోసం పని చేయాలని, ఏ గ్రామంలో ఎలాంటి సమస్యలు ఉన్నా అధికారులు తక్షణమే స్పందించి పరిష్కరించాలని సూచించారు. మూడు నెలలకొకసారి జరిగే మండల సమావేశానికి అన్ని శాఖలకు చెందిన అధికారులు హాజరు కావాలని, రాని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం పలు గ్రామ పంచాయతీలకు చెందిన సమస్యలను ప్రజాప్రతినిధులు సభలో అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీపీ రామానుజం, ఉప ఎంపీపీ శుభకరుణమ్మ, ఈఓపీఆర్డీ రాధాకృష్ణవేణి, పీఆర్ డీఈ మధుసూదన్‌రావు, వ్యవసాయాధికారి మ్యాగీ, ఎంఈఓలు రవిశంకర్, వంశీకృష్ణ, సీడీపీఓ సావిత్రమ్మ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

మైదుకూరు సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్

మైదుకూరు: మైదుకూరు మున్సిపాలిటీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ తెలిపారు. మంగళవారం మైదుకూరు మున్సిపాలిటీ సర్వసభ్య అత్యవసర సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రభుత్వ స్థలాలను చాలా మంది కబ్జా చేశారని, వాటి వివరాలను, ఎక్కడెక్కడ ఖాళీ స్థలాలు ఉన్నాయో వాటి వివరాలను వచ్చే సమావేశానికల్లా తనకు అందజేయాలని కమిషనర్‌ను ఆదేశించారు.

ఇదేం కరెంటు కోత సార్..

సమావేశంలో పాల్గొన్న 7వ వార్డు కౌన్సిలర్ ఏపీ సుమలత మాట్లాడుతూ రోజుకు లెక్కలేనన్ని సార్లు విద్యుత్ సరఫరా నిలిచిపోతోందని, ఉక్కపోతతో ప్రజలు అల్లాడుతున్నారని ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. వ్యాపారులు అవస్థలు పడుతున్నారని అన్నారు. వినియోగదారులు ఎల్‌సీ తీసుకోవడం వల్లే విద్యుత్ సరఫరాలో అంతరాయం జరుగుతోందని ట్రాన్స్‌కో ఏఈ రామభద్రయ్య వివరణ ఇచ్చారు. కరెంటు సరఫరాలో కోతలు లేకుండా చూడాలని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ సూచించారు. సమావేశంలో కమిషనర్ శ్రీనివాసులరెడ్డి, మేనేజర్ పరమేశ్వరరెడ్డి, ఏఈ విశ్వ కిరీటి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పంటల సాగు

అట్లూరు: పెరుగుతున్న జనాభాను దృష్టిలో ఉంచుకొని 365 రోజులు పంటలు సాగులో ఉండేలా చర్యలు చేపట్టాలని బద్వేలు వ్యవసాయ డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.నాగరాజ పేర్కొన్నారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా మంగళవారం మాడపూరు రైతు సేవా కేంద్రం పరిధిలోని కామసముద్రం, కోనరాజుపల్లి గ్రామాలలో పంట పొలాలను పరిశీలించడంతోపాటు రైతులతో గ్రామ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఊటుకూరు శాస్త్రవేత్త డాక్టరు భాగవతప్రియ, మండల వ్యవసాయ అధికారి జి.రామకృష్ణయ్య, జిల్లా వనరుల కేంద్రం కడప శివశైలజా, రైతుసేవా కేంద్రం వ్యవసాయ సహాయకులు ఎం.సందీప్ కుమార్, సర్పంచు ఆర్వీ సుబ్బారెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరిలో కాలిబాటలతో మేలు

చాపాడు: రైతులు వరి పైర్లలో కాలి బాటలను తప్పనిసరిగా తీయించుకోవాలని మండల వ్యవసాయాధికారి మ్యాగీ అన్నారు. మండలంలోని సోమాపురం, మొర్రాయిపల్లె గ్రామాలలో మంగళవారం పొలం పిలుస్తోంది గ్రామ సభలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సోమాపురం సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, వీఏఏ ఎం.పుష్పలత తదితరులు పాల్గొన్నారు.



అట్లూరు : కామసముద్రంలో పసుపు పంటను పరిశీలిస్తున్న ఏడీఏ, శాస్త్రవేత్తలు

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి

బ్రహ్మంగారిమఠం: మండలంలో అధికంగా రెవెన్యూ సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, వాటిని త్వరగా పరిష్కరించాలని ఎంపీపీ సి.వీరనారాయణరెడ్డి కోరారు. మంగళవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆన్‌లైన్ లేకపోవడంతో అమ్మకాలు, కొనుగోలుదారులు ఇబ్బందులు చెందుతున్నారన్నారు. స్పందించిన తహసీల్దార్ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ బి.మఠం మండలంలో భూ సమస్యలు ఇప్పటివి కాదని, గత కొన్ని ఏళ్లుగా ఉన్నాయని, వాటి పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తానన్నారు. నేషనల్ హైవే రోడ్డులో భూములు పోయిన వారికి అన్ని పత్రాలు సరిగా ఉంటే నష్ట పరిహారం తప్పకుండా వస్తుందన్నారు. జెడ్పీటీసీ ఎం.రామగోవిందరెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలను అధికారులు గుర్తించి వారికి తగిన న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

ఫిర్యాదులు లేని సేవలే లక్ష్యంగా పని చేయాలి

ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ



మాట్లాడుతున్న ఏపీఎస్‌పీడీసీఎల్ ఎస్‌ఈ ఎస్.రమణ

ప్రొద్దుటూరు: వినియోగదారుల నుంచి ఫిర్యాదులు లేని సేవలే లక్ష్యంగా ఉద్యోగులు పనిచేయాలని ఉమ్మడి వైఎస్సార్ జిల్లా ఏపీఎస్‌పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజినీర్ ఎస్.రమణ తెలిపారు. మంగళవారం స్థానిక విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయంలో ప్రొద్దుటూరు, రాజుపాళెం, జమ్మలమడుగు, మైలవరం, ముద్దనూరు, పెద్దముడియం, కొండాపురం, ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాల అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గృహ విద్యుత్ బిల్లులు తగ్గించుటకు ప్రధాన మంత్రి సూర్య ఘర్ యోజన పథకం ద్వారా గృహాలకు రూఫ్ టాప్ సోలార్ ఏర్పాటు చేసుకునేందుకు ప్రభుత్వం రాయితీ ఇస్తోందన్నారు. ఒక కిలో వాట్ సామర్థ్యంకు రూ.30 వేలు, రెండో కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.60 వేలు, మూడు కిలో వాట్స్ సామర్థ్యంకు రూ.78 వేల చొప్పున రాయితీ అందిస్తుందని, రాయితీ పోను మిగిలిన మొత్తంకు తక్కువ వడ్డీతో బ్యాంకు రుణాలు ఇస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు ఉపయోగించుకునేలా అధికారులు చైతన్యపరచాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ప్రొద్దుటూరు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రమణారెడ్డి, డీఈఈలు, ఏఈలు, జేఈలు, అకౌంట్స్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జయహో.. జగన్మాత



బ్రహ్మంగారిమఠం : ఈశ్వరీదేవి మఠంలో శ్రీ మహాలక్ష్మీదేవి



పోరుమామిళ్ల : శ్రీ లక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో..



బద్వేలు అర్బన్ : వాసవీ కన్యకా పరమేశ్వరీ ఆలయంలో..



రాజుపాళెం : గజలక్ష్మీదేవి అలంకారంలో అంకాలమ్మ



మైదుకూరు : అమ్మవారిశాలలో శ్రీ భువనేశ్వరీదేవి



ప్రొద్దుటూరు కల్చరల్ : ముక్తిరామలింగేశ్వరస్వామి ఆలయంలో శ్రీగజలక్ష్మీదేవి

బద్వేలు అర్బన్: దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ప్రొద్దుటూరు క్లస్టర్ పరిధిలోని ప్రొద్దుటూరు, బద్వేలు, మైదుకూరు నియోజకవర్గాల్లో కనుల పండువగా నిర్వహిస్తున్నారు. ఆరో రోజైన మంగళవారం అమ్మవారు వివిధ రూపాల్లో దర్శనమిచ్చి అభయమిచ్చారు. భక్తులు పెద్ద ఎత్తున ఆలయాలకు తరలివచ్చి కనులారా దర్శించుకున్నారు. 'జయహో జగన్మాత' అని కీర్తించారు. తమను చల్లగా చూడాలని వేడుకున్నారు. బద్వేలులోని అమ్మవారిశాలలో నిర్వహించిన తోటోత్సవం విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారు జగన్మోహినిదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. మహాలక్ష్మీదేవి ఆలయం, వీరభద్రస్వామి దేవాలయంలో సంతానలక్ష్మీదేవిగా అమ్మవారిని అలంకరించారు. కోదండరామాలయంలో శ్రీరామావతారంలో స్వామివారు దర్శనమిచ్చారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రీధనలక్ష్మీదేవి అలంకారం

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ లక్ష్మీవెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మోహినీదేవి అలంకారంలో వెంకటేశ్వరస్వామి దర్శనమిచ్చారు. శ్రీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో వాసవీమాత శ్రీ గజలక్ష్మీదేవి అలంకారంలో అభయమిచ్చారు.

రాజుపాళెం: రాజుపాళెంలోని అంకాలమ్మ ఆలయంలో అమ్మవారు గజలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మైదుకూరు: మైదుకూరులోని శ్రీకన్యకాపరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారిని శ్రీ భువనేశ్వరీదేవిగా, భీమేశ్వరస్వామి ఆలయంలో మంగళగౌరీదేవిగా అలంకరించారు.

బ్రహ్మంగారిమఠం: శ్రీ ఈశ్వరీదేవిమఠంలో అమ్మవారికి శ్రీ మహాలక్ష్మీదేవి, అమ్మవారిశాలలో ధనలక్ష్మీదేవి అలంకరణ చేశారు.

కాశినాయన: నరసాపురంలో అమ్మవారు ఒత్తుల అలంకారంలో దర్శనమిచ్చారు.

దువ్వూరు: దువ్వూరులోని శ్రీమరకత వాసవి కన్యకా పరమేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు శ్రీమీనాక్షిదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు.

ఖాజీపేట: స్థానిక అమ్మవారిశాలలో వాసవీ కన్యకా పరమేశ్వరిదేవిని ధనలక్ష్మీదేవిగా అలంకరించారు. అమ్మవారిని ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ దర్శించుకున్నారు.



ప్రొద్దుటూరు కల్చరల్ : చెన్నకేశవ స్వామి ఆలయంలో సంతానలక్ష్మి



బి.మఠం : అమ్మవారిశాలలో ధనలక్ష్మీదేవిగా..



ఖాజీపేట : ధనలక్ష్మిగా వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి



దువ్వూరు : శ్రీమీనాక్షీదేవి అలంకరణలో వాసవి మాత



కాశినాయన : నరసాపురంలో ఒత్తుల అలంకారంలో అమ్మవారు



ప్రొద్దుటూరు కల్చరల్ : వైఎంఆర్ కాలనీ సాయిబాబా ఆలయంలో..

భక్తిశ్రద్ధలతో అష్టోత్తరం



అష్టోత్తర కార్యక్రమం నిర్వహిస్తున్న భక్తులు

పోరుమామిళ్ల: పట్టణంలోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరీ దేవస్థానంలో మంగళవారం ఆర్యవైశ్య సంఘ అధ్యక్షులు విశ్వనాథుల ప్రసాద్ ఆధ్వర్యంలో వాసవీమాతకు రూపాయి బిల్లలతో భక్తిశ్రద్ధలతో అష్టోత్తరం నిర్వహించారు. శ్రీ గజలక్ష్మీదేవి అలంకారం సందర్భంగా మహిళా మండలి అధ్యక్షురాలు పలుకూరి రాధ అధ్యక్షతన పట్టణ ఆర్యవైశ్య మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఎగ్జిబిషన్ రేట్లు తగ్గించండి



మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి

ప్రొద్దుటూరు: ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్న ఎగ్జిబిషన్ నిర్వాహకులపై చర్యలు తీసుకుని రేట్లు తగ్గించేలా చూడాలని 32వ వార్డు కౌన్సిలర్ భూమిరెడ్డి వంశీధర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునను కలిసి ఆయన వినతి పత్రం సమర్పించారు. కౌన్సిల్‌లో ఆమోదించిన మున్సిపల్ గెజిట్‌కు విరుద్ధంగా తొలి రోజు నుంచే టీడీపీ వర్గీయుడైన ఆర్‌వీ చలపతి దోపిడీ చేస్తున్నారన్నారు. నిబంధనల ప్రకారం ఎగ్జిబిషన్ లోపల చిన్న పిల్లల ఆట వస్తువులకు సంబంధించి రూ.40 టికెట్ వసూలు చేయాల్సి ఉండగా రూ.70 వసూలు చేస్తున్నారన్నారు. పెద్దలకు సంబంధించి రేంజర్, కొలంబస్, జెయింట్‌వీల్‌కు రూ.80 బదులు రూ.100 వసూలు చేస్తున్నారన్నారు. ఎంట్రన్స్ టికెట్ పెద్దలకు రూ.25కు బదులు రూ.30, పిల్లలకు రూ.15 బదులు రూ.20 వసూలు చేస్తున్నారని తెలిపారు. ఎక్కడా ఎగ్జిబిషన్ ధరలకు సంబంధించి బ్యానర్ వేయలేదన్నారు. కాంట్రాక్టర్ రూ.2.06 కోట్లు చెల్లించాల్సి ఉండగా ఇప్పటి వరకు కేవలం రూ.70 లక్షలు మాత్రమే చెల్లించారన్నారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని కమిషనర్ ఈ సందర్భంగా తెలిపారు.